ప్రజాశక్తి

ఆదివారం 14 ఏప్రిల్ 2024 పేజీలు 8


విజయనగరం


పార్వతీపురం మన్యం



భీమసింగి సహకార చక్కెర కర్మాగారం విషయంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి రెండూ ఒకే వైఖరి అవలంభిస్తున్నాయి. ప్రభుత్వ విధానాల ఫలితంగా ఈ సుగర్ ఫ్యాక్టరీ మూతపడింది. కానీ ఆ నెపాన్ని రైతులపైకి నెడుతూ సాగుకు సరిపడా చెరకు లేకపోవడం వల్లే ఫ్యాక్టరీ నడవడం లేదని ప్రజాప్రతినిధులు చెప్పడం అటు రైతులను, కార్మికులను ఆవేదనకు గురిచేస్తోంది. గతంలో చంద్రబాబు వైఖరితో ఈ ఫ్యాక్టరీ మూతపడితే తాజాగా జగన్ ప్రభుత్వం కూడా దాన్ని తెరిపించేందుకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. ఈ ప్రాంత రైతాంగానికి, కార్మికులకు బతుకు తెరువినిచ్చే ఫ్యాక్టరీని మూసేసి ఈ ప్రాంతంలో చెరకు పంట కనుమరుగయ్యేలా చేసింది. ఉన్నంతలో ఫ్యాక్టరీని నడిపి రైతులకు బాసటగా నిలవాలన్నది ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష. కానీ పాలకపక్షాలు ఎన్నికల సమయాల్లో హామీలు గుప్పించి, అధికారం చేపట్టక మాటతప్పడం పరిపాటిగా మారింది.

ఎన్నికల హామీలు ఉత్తివే

- భీమసింగిని తెరిపిస్తామని గత ఎన్నికల్లో హామీ
- ఫ్యాక్టరీ మూతతో చెరకు సాగు ప్రశ్నార్థకం
- మోసపోయిన రైతాంగం
- టిడిపి, వైసిపి రెండింటిదీ ఒకటే వైఖరి

ప్రజాశక్తి - జామి

భీమసింగి చక్కెర ఫ్యాక్టరీకి సుదీర్ఘకాల చరిత్ర ఉంది. రైతులు షేర్ ధనంతో నిర్మించుకున్న ఈ ఫ్యాక్టరీని మూసివేసి రైతులను, ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులను నట్టేలా ముంచేశారు. సహకార రంగాన్ని బలోపేతం చేస్తానని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసిన వైసిపి.. అధికారం లోకి వచ్చి ఐదేళ్లుఅయినా కమిటీల పేరుతోనే కాలయాపన చేసింది. టిడిపి ప్రభుత్వ హయాంలో సహకార రంగ ఫ్యాక్టరీలకు ఒక్క రూపాయి కూడా సహకారం అందలేదు. అప్పట్లో చంద్రబాబు కూడా నిపుణుల కమిటీని వేసి, చేతులు దులుపుకున్నారు. చివరికి ప్రభుత్వం దిగిపోయినా, ఆ కమిటీ నివేదిక మాత్రం బహిర్గతం కాలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం (మిగతా..3లో)

ఆందోళనబాట

వాస్తవానికి సహకార ఫ్యాక్టరీలన్నింటిలోనూ చెరకు క్రషింగ్ శాతం తగ్గింది. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు ఫలితంగా చెరకు మద్దతు ధర లేకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ఎటువంటి సహకారమూ లేకపోవడంతో రైతులకు చెరకు సాగుపట్ల ఆసక్తి తగ్గుతోంది. భీమసింగి సహకార ఫ్యాక్టరీ ఒకప్పుడు 1.60 లక్షల టన్నులు క్రషింగ్ చేయగా, ప్రస్తుతం 30 వేల టన్నులు కూడా లభ్యం కాదని అధికారులు సెలవిస్తున్నారు. ఆధునీకరణ చేస్తామన్న పేరుతో క్రషింగ్‌ను ఆపేసింది. దీంతో ఫ్యాక్టరీ మూతబడడం ఖాయమని తెలిపోయింది. ఈ తరుణంలోనే వామపక్షాలు, ప్రతిపక్ష పార్టీలు ఆందోళన బాట పట్టాయి. కానీ వైసీపీ ప్రభుత్వం స్పందించడం లేదు.


ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రణాళికను విడుదల చేస్తున్న ప్రధాన కార్యదర్శి అజశర్మ, శ్రీనివాస

ఉత్తరాంధ్ర అభివృద్ధికి
చిత్తశుద్ధితో నిలవండి

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ ● ప్రణాళిక విడుదల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల్లో పోటీచేస్తున్న వారు ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిత్తశుద్ధిగా నిలబడాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం. శ్రీనివాస అధ్యక్షతన జరిగిన సదస్సులో ముందుగా ఉత్తరాంధ్ర మేనిఫెస్టో 2024ను అజశర్మతో పాటు ఎం.శ్రీనివాస, ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగుల (మిగతా..3లో)


మిమ్స్ ఉద్యోగుల పోరాటం స్ఫూర్తిదాయకం మెయిన్ లో


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ఎన్నికల ప్రక్రియపై
సంపూర్ణ అవగాహన ఉండాలి

- మాక్ పోల్ అత్యంత కీలకం
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-శృంగవరపుకోట, విజయనగరం కోట

ఎన్నికల ప్రక్రియ పట్ల ప్రిసైడింగ్ అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి అన్నారు. ఈ ప్రక్రియలో ఏమైనా అనుమానాలు ఉంటే ఇప్పుడే నివృత్తి చేసుకోవాలని ఆమె కోరారు. పిఒలకు, ఎపిఒలకు అన్ని నియోజకవర్గాల్లోనూ శనివారం శిక్షణ ఇచ్చారు. ఎస్.కోటలో జరుగుతున్న ఎన్నికల శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పిఒలు, ఎపిఒలకు అన్ని అంశాల పట్ల సమగ్ర అవగాహన ఉన్నప్పుడే, ఓటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తి అవుతుందని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో (మిగతా..3లో)

కండువాల మార్పు .. అభూత కల్పన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికల దగ్గరపడ్డాయ్. ప్రచారం ఊపందుకుంటోంది. అభ్యర్థులు, పార్టీలు ఎత్తుకు పైఎత్తులతో ముందుకు సాగుతున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నా వైసిపి, టిడిపి అభ్యర్థులు తమ బలహీనతను, లోపాలను, తమపై ప్రజల్లోవున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కండువాల మార్పు ఇందుకు మచ్చుతునక. అది ఎంత వరకు వచ్చిందటే. సొంత పార్టీకి చెందిన కార్యకర్తలనే ప్రత్యర్థిపార్టీగా చిత్రీకరించి, వారు తమ పార్టీలో చేరిపోతున్నట్టు ప్రకటించుకునేంత వరకు వచ్చింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఇటువంటి వ్యవహారాలు జోరుగా సాగుతున్నాయి. కురుపాం వైసిపి అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి కొద్దిరోజుల క్రితం కొంతమందికి పార్టీ కండువాలు కప్పారు. వారంతా సిపిఎం పార్టీకి చెందినవారని, తమ విధానాలు, తన అభివృద్ధి మెచ్చుకుని వైసిపిలో చేరారని ప్రకటించారు. ఆ మరుచటి రోజే సిపిఎం నాయకులు ఆ ప్రకటనను తీవ్రంగా ఖండించారు. విషయమేమంటే పుష్పశ్రీవాణి కండువాలు కప్పినవారు సిపిఎం పార్టీకి చెందినవారు కాదు. వారంతా చాలా కాలంగా వైసిపిలో ఉంటున్నవారే. అధికార, ప్రతిపక్ష పార్టీల విధానాలు, వేధింపులు, నిర్లక్ష్యం వెరసి సిపిఎంపై వైపు జనాలు వెళ్తున్నారనే భయంతో ఆ పార్టీ తనవైపు వచ్చినట్టు ప్రకటించుకున్నారు. ఇది కేవలం కురుపాంలోనో, లేక వైసిపిలోనో జరుగుతున్న వ్యవహారం మాత్రమే కాదు. దాదాపు ఉమ్మడి విజయనగరం జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ ఇదే జరుగుతోంది. సొంతపార్టీకి వారి కండువాలు కప్పి, ఇతర పార్టీల నుంచి వచ్చినట్టుగా ప్రకటించుకోవడం నేటి ఎన్నికల్లో ట్రెండింగ్‌గా మారిపోయింది. ఇది టిడిపిలోనూ కనిపనిస్తోంది. గ్రామ, వార్డు స్థాయి నాయకులు కూడా ఇతర పార్టీల నుంచి వచ్చినట్టు చెప్పుకునేందుకు ఏమాత్రం సిగ్గుపడడం లేదు. అక్కడక్కడ ముందురోజు ఒక పార్టీ కండువా, మరుచటిరోజు మరో పార్టీ కండువా కప్పుకుంటున్న వారు కూడా కనిపిస్తున్నారు. ఇటువంటి చోట్ల ప్రలోభాలు ఉన్నట్టుగా చర్చనడుస్తోంది.



ఇక ప్రచారం విషయానికి వస్తే టిడిపి అభ్యర్థులు, నాయకులు ఒక్కరి అవకాశామివ్వాలంటూ ఓటర్లకు చేతులు జోడించి నమస్కారాలు చేస్తున్నారు. వైసిపి అభ్యర్థులు మరోసారి అవకాశం ఇవ్వాలంటున్నారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని, హామీలను పూర్తిగా విస్మరించిందంటూ టిడిపి అభ్యర్థులు ప్రచారం చేస్తుండగా, తమ ప్రభుత్వ హయాంలోనే అవినీతి లేకుండా పథకాలు అందాయని, అభివృద్ధి కూడా ఎంతో జరిగిందని చెబుతున్నారు. వాస్తవమేమంటే వైసిపి హయాంలో అభివృద్ధి జరగకపోవడంపైగానీ, ఎన్నికలకు ముందు ఎమ్మెల్యేలు, సిఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంపైగా టిడిపి చర్చకు పెట్టడం లేదు. ఈ మాటకొస్తే గడిచిన ఐదేళ్లలో మొదటి నాలుగేళ్లు ప్రజాసమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను టిడిపి గాలికి వదిలేసింది. ఇదే అదునుగా వైసిపి కేంద్రం ప్రవేశపెట్టిన చెత్తపన్ను, పట్టణాల్లో విలువ ఆధారిత ఆస్తి పన్ను, విద్యుత్ ఛార్జీలు, నిత్యవసర సరుకుల ధరలు, ఇలా ఒకటేమిటి పన్నుల పేరుతో ఆర్థిక భారాలు మోపింది. 'ఎల్లమ్మను ఎంచక్కర్లేదు..... పోలమ్మను పోల్చక్కర్లేదు' అన్ననట్టుగా రెండు పార్టీలూ ఒక్కటేనంటూ జనం చర్చించు కుంటున్నారు. గడిచిన ఐదేళ్లలో టిడిపి, వైసిపి సభ్యులు అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలు, బూతుపురాణాలు తప్ప, ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో చర్చించిందేమీ లేదని, ఇక పార్లమెంటులో అయితే కేంద్రంలోని బిజెపికి చేసిన ప్రజావ్యతిరేక చట్టాలకు ఈ రెండు పార్టీలకు చెందిన ఎంపీలు కలిపి మద్దతు ఇవ్వడం మినహా మన రాష్ట్ర ప్రగతి, ప్రత్యేక హోదా, ఇతర హక్కుల కోసం అడిగిందేమీ లేదని జనం చర్చించుకుంటున్నారు. ఈనేపథ్యంలో ఈసారి ఓటర్లు అంత సులువుగా నమ్మే పరిస్థితి లేదని, ఆచూతూచి, అవసరమైతే ప్రత్యామ్నాయం వైపు కూడా జనం దృష్టిమళ్లే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు చెబుతున్నారు.

కొమిరి, రేగిడి, బొడ్డవలస కేంద్రంగా
ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కొమిరి, రేగిడి, బొడ్డవలస కేంద్రాలుగా నాగావళి నది నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది ఇసుక ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇష్టాను సారంగా నదిని తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాల పరిధిలో సచివాలయాలు ముందు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే సచివాలయ ఉద్యోగులు ఏమి పట్టనట్లు వ్యవహరించడం పట్ల ముడుపులు అందుతున్నాయన్న అనుమా నాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక ఎత్తైతే రాజాం -పాలకొండ ప్రధాన రహదారి ఉంగరాడ మెట్ట వద్ద పోలీస్ స్టేషన్ ముందు నుంచే రోజువారి వందలాది ఇసుక ట్రాక్టర్లు ఎటువంటి రసీదులు లేకుండా అక్రమంగా వేల క్యూబిక్ మీటర్లు ఇసుక వాహనాల ద్వారా అక్రమంగా తరలిపోతుంటే రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ముడుపులు అందుతున్నాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇతర ప్రాంతాలకు తరలింపు

ప్రభుత్వ సహజ సంపదను అక్రమంగా ఇసుకాసురులు యథేచ్ఛగా రాజాం, చీపురుపల్లి, విజయనగరం ఇతర ప్రాంతాలకు తరలించడంతోపాటు తోటల్లో ఇసుకను అక్రమ నిల్వలు ఉంచి రాత్రిపూట లారీలతో విశాఖ, చెన్నై ప్రాంతాలకు లారీకి రూ.50వేలు నుంచి రూ.లక్ష వరకూ అమ్మి సొమ్ముచేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరిగినా అధికారు లకు చలనం లేకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసిరినాయుడు కనుసన్నల్లోనే..!

ఇసుక అక్రమ రవాణా అచ్చన్న వలసకు చెందిన అసిరినాయుడు కనుసన్నల్లోనే జరుగుతుందని మండలంలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇతని ట్రాక్టర్లతో పాటు ఆయా గ్రామాల ట్రాక్టర్ యజమానులతో మమేకమై సహజ సంపద ఇసుకను దోచేస్తున్నారు. అసిరి నాయుడు ట్రాక్టర్లు సీజ్ చేస్తే గాని ఈ ఇసుక అక్రమ రవాణా అరికట్టలేమని బహిరంగంగానే చెబుతు న్నారు. ప్రజాశక్తి ధైర్యం చేసి కొమిరి, రేగిడి, బొడ్డవలస ఇసుక అక్రమ తవ్వకాలు వద్దకు వెళ్లి పరిశీలించగా లచ్చన్న వలస అసిరినాయుడు, వారు అనుచరులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు కూలీలు తెలిపారు. స్వయంగా అసిరి నాయుడుతో ప్రజాశక్తి మాట్లాడితే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు వారానికి డబ్బు కడుతున్నట్లు చెబుతూ దుర్భాషలాడి, ఏ అధికారులతో చెప్పుకుంటే ఏమీ పీకేది లేదని సమాధానం ఇచ్చారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్ఐకు సమాచారం ఇవ్వగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

అడిగే వారే లేరనీ..

అడిగే వారు లేరనే



రేగిడి నాగావళిలో అక్రమంగా ట్రాక్టర్‌కు ఇసుకును ఎత్తుతున్న అక్రమార్కులు

- పోలీస్ స్టేషన్ ముందు నుంచి వెళ్లినా పట్టని వైనం
- ఓ ట్రాక్టర్ యజమాని అసిరి నాయుడే కీలకం?
- అధికారులకు లంచాలు ఇస్తున్నానని ఎదురు ప్రశ్నలు
- చెక్‌పోస్ట్‌లు ఉన్నా పట్టించుకోని యంత్రాంగం



కొమిరిలో జెసిపితో ఇసుకను తవ్వి పోగు వేస్తున్న అక్రమార్కులు

ఉద్దేశ్యంతో ఇష్టానుసారంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేగిడి నాగావళి నది అక్రమ ఇసుక రవాణా విషయానికొస్తే స్థానిక మాజీ, తాజా నాయకుల ప్రమేయ ంతోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతో ందని గ్రామస్తులు తెలిపారు. బొడ్డవలస ఇసుక అక్రమ రవాణాలో కూడా స్థానిక నాయకుల హస్తం ఉందని చెబుతున్నారు. వందలాది ట్రాక్టర్లు రాజాం- పాలకొండ ప్రధాన రహదారి బొడ్డవలస నుంచి రాజాం మీదుగా అక్రమ ఇసుక రవాణా జరిగితే చెక్ పోస్టులు, ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేయకపోవ డంతో పాటు వాహనాలను సీజ్ చేయలేక పోవడం విడ్డూరంగా ఉందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నేపథ్య ంలో ఇసుక అక్రమ రవాణా కనీసం అధికా రులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్ర మంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న ట్రాక్టర్ యజమానులు వైసిపి నాయకులకు ఫోన్లు చేసి ఆ నాయకులు అధికారులకు ఫోన్లు చేసి, కేసులు లేకుండా పంపించే దిశగా అధికారులు పనిచేస్తు న్నారు. ఒక వేల ఎక్కడో ఒక దగ్గర ఒకటి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నా వైసిపి నాయ కులు ఫోన్ చేసి విడిపించడంతో తమ కెందుకు అని అధికారులు కూడా వదిలేసు న్నట్లు తెలిస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రేగిడి మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, ప్రభుత్వ సహజ సంపదను కాపాడి ఇసుకాసురులను గుర్తించి శాశ్వత రమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రేగిడి: మండలంలోని నాయరాలవలస పంచాయతీలో ఎర్రవాని చెరువు పనులను ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ శనివారం పరిశీలించారు. ఈ చెరువులో 176 మంది వేతనదారుల మస్టర్స్ తనిఖీ చేశారు. వేతనదారులతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పూటలా పనిచేయాలని, కొలతలు ప్రకారం పనిచేసినట్లు అయితే రూ.300 కూలీ వస్తుందని అవగాహన కల్పించారు. మేట్లు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు రెండు పూటలు పంపించాలని తెలిపారు. ప్రతీ వేతనదారులు తాగునీరు తప్పనిసరిగా తెచ్చుకోవాలని సూచించారు. వేసవి ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండ తీవ్రతను బట్టి ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనులు చేసి, రెండోపూట మూడు నుంచి ఆరు గంటల వరకు పనులు చేయాలని సూచించారు.



రేషన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

రేషన్ కోసం ఎదురుచూపులు

వేపాడ: మండలంలోని ఓబులయ్యపాలెం గ్రామంలో రేషన్ సరుకుల కోసం లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. నెల ప్రారంభమై రెండు వారాలు కావస్తున్నా నేటికీ సరుకులు అందలేదు. రేషన్ పంపిణీదారుడు ఎప్పుడొస్తారోనని గ్రామ స్తులు శనివారం వీధుల్లో కూర్చుని ఎదురుచూడాల్సి వచ్చింది. వెంటనే రేషన్ పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భవనం లేకుండా అడ్మిషన్‌లా?

బొబ్బిలి: కళాశాలకు భవనం, అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహించడం అన్యాయమని విద్యార్థి జెఎసి అధ్యక్షులు బి.సాయి కిరణ్ అన్నారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య కళాశాలకు బొబ్బిలిలో అనుమతులు, సొంత భవనం లేకపోయినా అడ్మిషన్లు చేస్తు న్నారని ఆరోపించారు. కళాశాలకు అద్దెకు తీసుకున్న భవనం నిర్మాణంలో ఉంటే ఎలా అడ్మిషన్లు చేస్తారని ప్రశ్నించారు. కార్పొరేట్ కళాశాలలకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు ఇస్తే వారు ఎందుకు నిబంధనలు పాటిస్తారని ప్రశ్నించారు.

15న ఉపకరణాల నిర్ధారణ శిబిరం

బాడంగి: ఈ నెల 15న రామభద్రపురంలోని భవిత కేంద్రంలో వికలాంగులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఇఒలు లక్ష్మణదొర, రాజేశ్వరి, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాడంగి మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 18 ఏళ్లలోపు వారు హాజరుకావాలని కోరారు. శారీరక వైకల్యం, స్పర్శలేకపోవడం, వినికిడి లోపంతో ఇబ్బంది పడుతున్నవారు సదరం, ఆధార్, రెండు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

నేడు విద్యుత్తు అంతరాయం

నెల్లిమర్ల: మండలంలో పలు గ్రామాల్లో ఈ నెల 14న విద్యుత్ అంత రాయానికి వినియోగదార్లు సహకరించాలని సబ్ స్టేషన్ ఎఇ పిచ్చయ్య కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ నిమిత్తం జరుగు పనుల కారణంగా సీతారాముని పేట రూరల్ ఫీడర్11కెవి పరిధిలో ఆదివారం సీతారాముని పేట, గొర్లిపేట, కొత్త పేట, దన్నానపేట, కోరాడ పేట, కుదిపి, నీలం రాజు పేట, ఏటి అగ్రహారం గ్రామాలు, 11కెవి ఫీడర్ వాటర్ వర్క్స్ పరిధిలో పంప్ హౌస్, సత్య థియేటర్, ఎంఆర్ఒ ఆఫీస్, హౌసింగ్ కాలనీ, బిసి గురుకుల పాఠశాల, కెజిబివి, మిమ్స్ ప్రాంతాల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదార్లు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజాస్వామ్యానికి ఎన్నికలు కీలకం

శృంగవరపుకోట: ప్రజాస్వామ్యానికి ఎన్నికలు అత్యంత కీలకమైనవని ఓటరు అక్షరాస్యత వేదిక ముఖ్య సలహాదారు డాక్టర్ త్రినాథరావు అన్నారు. పట్టణంలోని దేవి బొమ్మ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఓటరు అక్షరాస్యత వేదిక ఆధ్వర్యాన ఓటర్లను చైతన్యం చేసేందుకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది బొబ్బిలి చంద్రశేఖర్, వేదిక ప్రతినిధులు వి.సన్యాసప్పడు, లంక సాంబమూర్తి, సిహెచ్ రామకృష్ణ, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో పోలీసు కవాతు

ప్రజాశక్తి - చీపురుపల్లి

కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులతో స్థానిక సిఐ షన్ముఖరావు ఆధ్వర్యంలో చీపురుపల్లిలో శనివారం పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికల వేల ప్రజలెవరూ ఎటువంటి భయ బ్రాంతులకు గురి కాకుండా ఉండేందుకు తమ ఓటు హక్కును స్వేఛ్చాయుతంగా వేసుకునేందుకు ప్రజలకు పలు సూచనలను సిఐ షన్ముఖరావు చేశారు. ఈ కవాతు ద్వారా ప్రజలకు అండగా తామున్నామంటూ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విజయనగరం జిల్లా ఎస్‌పి సూచనలు మేరకు కవాతు చేపట్టినట్లు తెలిపారు. రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలను సన్నద్ధం చేసేందుకు ఈ కవాతుని ఏర్పాటు చేసామన్నారు. ప్రజలు ప్రశాంత వాతావ రణంలో ఓటు హక్కుని వినియోగించుకునేలా ఈ ప్రదర్శనను చేపట్టామని తెలిపారు. ఈ కవాతు జి అగ్రహారం, వంగపల్లి పేట, చీపురుపల్లి పంచాయతీ పరిధిలో పలు వీధులలో సుమారు పది కిలోమీటర్ల మేర కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఎస్ఐ కె కిరణ్‌కుమార్ నాయుడు, ఆర్‌పియస్‌యఫ్ ఎస్ఐ ఎల్ఆర్ చాత్, ఎస్ఐ సత్యనారాయణలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడంలో విఫలం

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని చెప్పారు. ప్రభుత్వం స్పందించి జూనియర్ కళాశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు.

వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలో వాలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. శనివారం మొయిద, బూరాడపేట సచివాలయం పరిధిలో వాలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపిడికి అందించారు. ఈ సందర్భంగా వారు మాజీ సిఎం, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణి చేయవద్దని తమను అపహస్యం చేసి కోర్టుల ద్వారా ఎన్నికల కమిషన్ ఫిర్యాదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తామంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నామన్నారు.



నెల్లిమర్ల: రాజీనామా పత్రాలతో వాలంటీర్లు

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో వాలంటీర్లు రాజీనామాలు చేశారు. శనివారం రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కొత్తమ్మతల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బొడ్డవర ఆటో స్టాండ్ వద్ద శనివా రం చలివేంద్రం ఏర్పాటుచేశారు. దీనిని వైసిపి నాయకులు టి.సాంబమూర్తిరాజు ప్రారంభించా రు. మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్మికులు, పాల్గొన్నారు.

కోడూరులో భవిష్యత్తుకు గ్యారెంటీ

బాడంగి: మండలంలోని కోడూరు గ్రామంలో గొల్లవీధిలో బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా బిసి సాధికార కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఇంటింటికీ వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మరిపి రమేష్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై సంపూర్ణ అవగాహన ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

పారదర్శకంగా, అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. వివిధ అంశాల పట్ల సంపూర్ణ అవగాహన ఏర్పడటానికి, ఎన్నికల కమిషన్ పంపించిన వీడియోలను కూడా చూడాలని సూచించారు. శిక్షణకు వచ్చిన వారితో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు, చేసి వివిధ అంశాలను వివరించాలని అధికారులను ఆదేశించారు. ఓటింగ్ ప్రారంభించే ముందు మాకు పోల్ అత్యంత కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. మాక్ పోల్ నిర్వహించకపోతే, ఎన్నిక రద్దయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి పోలింగ్ బూత్ లో కచ్చితంగా ఉదయం 5:30కే మాక్ పోల్ నిర్వహించాలని స్పష్టం చేశారు. ఏజెంట్ల కోసం ఉదయం 5:45 వరకు వేచి ఉండి, అప్పటికీ వారు రాని పక్షంలో మాక్ పోల్ పూర్తి చేయాలని సూచించారు. మాక్ పోల్ అనంతరం వివి ప్యాట్లను క్లియర్ చేయడం, సీల్ చేయడం, ఇవిఎంలను రీసెట్ చేయడం లాంటి ప్రక్రియను పూర్తి చేసిన అనంతరమే, సాధారణ ఓటింగ్ ప్రక్రియను మొదలు పెట్టాలని తెలిపారు.

పోలింగ్ రోజు సమయ నిర్వహణ కీలకమని స్పష్టం చేశారు. ఉదయం పోలింగ్ ప్రారంభమైన దగ్గర్నుంచే వేగంగా ఓటింగ్ నిర్వహించడానికి కృషి చేయాలని సూచించారు. దీనివల్ల నిర్ణీత సమయానికి ఓటింగ్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. పోలింగ్ అనంతరం అవసరమైన అన్ని పత్రాలను సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులను తప్పులు జరగకూడదని, రీపోల్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ జరుగుతున్నప్పుడు పోల్ డే మేనేజ్మెంట్ సిస్టమ్ యాప్ లో అవసరమైన వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత రిసెప్షన్ సెంటర్ వరకూ అదనపు పోలింగ్ సిబ్బంది కూడా పిఒలతో కలిసి రావాలని కలెక్టర్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక కేంద్రాలను, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఇవిఎంలకోసం సిద్ధం చేసిన స్ట్రాంగ్ రూమ్ లను కలెక్టర్ పరిశీలించారు.

కార్యక్రమంలో ఎస్.కోట రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ, ఐదు మండలాల ఎఆర్ఒలు, డిప్యూటీ తాహాశీల్దారులు, సెక్టార్ అధికారులు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరంలోని విటి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన శిక్షణలో పిఒలు, ఎపిఒలతో పాటు తహశీల్దార్ పివి రత్నం, పోస్టల్ బ్యాలెట్ ఇన్‌ఛార్జి విజయలక్ష్మి, ఎఆర్ఒ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణను రిటర్నింగ్ అధికారి కార్తీక్, ఇఆర్ఒ ఎవి సూర్యకళ పరిశీలించారు.

పిఒలదే కీలక పాత్ర

బొబ్బిలి : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులదే కీలక పాత్రని ప్రత్యేక ఉప కలెక్టర్ ప్రమీల అన్నారు. శనివారం గొల్లపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పిఒల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో ప్రతివిషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇవిఎంల నిర్వహణపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. ఎన్నికల రోజు టైం మేనేజ్‌మెంట్ ముఖ్యమని అన్నారు. వీరితో పాటు బొబ్బిలి, రామభద్రపురం తహశీల్దార్లు త్రినాథ నాయుడు, సులోచన , ఎలక్షన్ డిటి సాయికృష్ణ, ఎంఇఒ గొట్టాపు వాసు, ఎఎల్‌టిఎంఎస్ జె సి రాజు, సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్, శంకర రావు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర సంగీత కచేరీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన కొత్తపేటలో దీక్షితార్ 249వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన గాత్రకచేరీ అందరినీ అలరించింది. మొకర మహేశ్వరరావు గాత్రకచేరికి వయోలిన్ పై వరుణ్ సాయి , మృదంగంపై శివకుమార్, సహకారం అందించారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, సభ్యులు దీక్షితార్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. మహేశ్వర రావు తన కచేరీని దేవమనోహరి రాగంలో శ్రీ గణనాథం భజారే అనే గీతంతో ప్రారంభించి డాక్టర్ యనమండ్ర శ్రీనివాస శర్మ గారు దీక్షితార్ పై రచించిన శ్లోకాన్ని నట రాగంలో ఆలపిస్తూ మహాగణపతిమ్ అనే కృతిని ఆలపించారు. దూసి శివరాం శర్మ, ధవళ సర్వేశ్వర రావు, టి.మహేశ్వర రావు కార్యక్రమాన్ని సమర్పించారు.

గ్రామాల్లో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గొల్లగాం, గంట్లాం గ్రామాలలో రాష్ట్ర ఐటీ వింగ్ జోనల్ ఇంచార్జి బడ్డుకొండ మణిదీప్‌నాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గ యువజన నాయకులు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు, నాయుకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఉపాధి హామీ కూలీలకు, ఇంటింటికి వెళ్లి అందిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసు, వైస్ ఎంపిపి తమ్మినాయుడు, సర్పంచులు రమణ రాజు, అప్పలనాయుడు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేతలే వైసిపి పాలన



ఓటర్లతో మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

ప్రజాశక్తి- విజయనగరం కోట

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి కూల్చివేతలే పరిపాలనగా పెట్టుకుందని టిడిపి అభ్యర్థి పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. శనివారం 30వ డివిజన్ కొత్త ధర్మపురి, బిసి కాలనీ ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. ప్రజావేదిక కూల్చివేతతో మొదలుపెట్టిన సైకో పాలనా రాష్ట్రంలో విధ్వంసాలు చేసుకుంటూ పోయిందని అన్నారు. ధరలు, పన్నులు పెంచి ప్రజల బతుకులను కూడా కూల్చివేశారని అన్నారు. పారిశ్రామిక అభివద్ధి జరగకపోవడంతో ఉపాధి అవకాశాల లేక యువత ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ద్వారపూడిలో గత తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1 మెగా వాట్ సోలార్ ప్లాంట్ ను వైసిపి పాలకులు ధ్వంసం చేసి రోజుకు సుమారు 4500 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని రాకుండా చేయడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. క్రీడాకారుల కోసం విజ్జి స్టేడియంలో నిర్మించిన ఇండోర్ స్టేడియం ను నిరుపయోగంగా వదిలేయడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. ఇలాంటి విధ్వంసాల పాలనను ఎదుర్కొనేందుకు టిడిపి, జనసేన, బిజెపి కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, విజయనగరం పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు కార్యదర్శి గంటా పోలినాయుడు, బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు , అవనాపు విజయ్ , పిల్లా విజయ్ కుమార్ గాడు అప్పారావు, తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ పర్యటన వాయిదా

విజయనగరం కోట : ఈనెల 16న విజయనగరంలో నిర్వహించ తలపెట్టిన సభ వాయిదా పడిందని టిడిపి నాయకులు తెలిపారు. కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని, త్వరలో తేదీని వెల్లడిస్తామని తెలిపారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో నిలవండి

(మొదటి పేజీ తరువాయి)

సంఘం నాయకులు వి. జగన్నాథ స్వామి, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.రామచంద్రరావు ఆవిష్కరించారు .అనంతరం అజశర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి కావలసిన ప్రణాళికలు ఈ మేనిఫెస్టోలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక తెలియజేసిందన్నారు. అపారమైన వనరులున్న ఉత్తరాంధ్ర నేటికీ వెనుకబాటులో ఉండడానికి ప్రధాన కారణం పాలకులు నిర్లక్ష్యం తప్ప మరొకటి కాదన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి కాకుండా, తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేయడం అత్యంత విచారకరమన్నారు. ఈ ప్రాంతాన్ని గత పదేళ్లలో ఏమాత్రం అభివృద్ధి చేయకుండా పాలకులు అవకాశవాదం ప్రదర్శించారన్నారు. రాష్ట్ర విభజన చట్టం అమలు చేయలేదన్నారు. దీనివల్ల ఈ పదేళ్ల కాలంలో ఉత్తరాంధ్ర మరింత వెనుకబాటులోకే నెట్టబడిందన్నారు. ఇది చాలాదన్నట్లు కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను అమ్మేయాలని నిర్ణయించిందన్నారు. వివిధ ప్రాజెక్టుల పేరుతో ఉత్తరాంధ్రలో విస్తారంగా ఉన్న అటవీ భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేసి, గిరిజనులను రోడ్లమీదకు నెట్టాలని చూస్తోందన్నారు. సముద్రంతో సహా సహజ వనరులు అన్నిటిని కార్పొరేట్ పరం చేస్తోందన్నారు. రాష్ట్రం, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడాల్సిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆ పని చేయకపోగా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపితో జతకట్టాయన్నారు. విభజన చట్టాన్ని అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపికి సహకరించేలా వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలోని ఈ మూడు ప్రధాన పార్టీల అవకాశవాదాన్ని ఎండగట్టి ప్రత్యామ్నాయం వైపు ప్రజల ఆలోచించాలని, రాష్ట్రం, ఉత్తరాంధ్ర అభివృద్ధి, స్టీల్ ప్లాంట్ రక్షణకై నిలవాలని ఈ సదస్సులో ప్రజలకు పిలుపునిచ్చారు. సదస్సులో మేధావులు,వివిధ ప్రజా సంఘాలు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు ఉత్తివే

(మొదటి పేజీ తరువాయి)

వెను వెంటనే సహకార ఫ్యాక్టరీల స్థితిగతులపై గురవారెడ్డి అధ్యక్షతన ఓ కమిటీని వేసింది. ఆ నివేదిక కూడా ఇంతవరకు బయటకు రాలేదు. తర్వాత మరోసారి ప్రభుత్వం రెండేళ్ల క్రితం జూన్ 25న ముగ్గురు మంత్రులతో కమిటీని నియమించింది. ఇందులో జిల్లాకు చెందిన అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణతోపాటు వ్యవసాయశాఖ మంత్రి కన్నబాబు, పరిశ్రమల శాఖా మంత్రి గౌతమ్ రెడ్డి ఉన్నారు. అదే ఏడాది ఆగస్టు 15 తేదీలోగా, కమిటీ నివేదికను అందజేయాలని ప్రభుత్వం సూచించింది. కానీ అదంతా బూతకంగానే మిగిలింది.

ఫ్యాక్టరీని నిలబెట్టే చర్యలపై దృష్టి సారించాలి

సహకార ఫ్యాక్టరీలను బాగు చేసేందుకు అనేక అవకాశాలున్నాయి. ప్రధానంగా సహకార ఫ్యాక్టరీలన్నీ పురాతనమైనవి కావడంతో ముందుగా యంత్రాలను ఆధునీకరించాలి. తక్షణమే క్రషింగ్ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలి. తద్వారా బయో ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లు నెలకొల్పడం సాధ్యమవుతుంది. దీనికి సుమారుగా రూ.10 కోట్ల నుంచి 15 కోట్లు అవసరం ఉంటుందని అంచనా. ఈ మూడింటిపై దష్టిసారిస్తేనే మనుగడ సాధ్యం. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఎజెండాగా భీమసింగి ఫ్యాక్టరీ అంశం ఉండాలని రైతులు కోరుతున్నారు. అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీని ఏం చేస్తారో చెప్పాలని ఈ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరు మహిళలు అరెస్టు

చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని సంతకాల బ్రిడ్జి వద్ద ఆటో ఎక్కి, కలెక్టరేట్ జంక్షన్ వద్ద దిగిన సబ్బవరం మండలం టెక్కలిపాలెం గ్రామానికి చెందిన మంచాడ సునీతను ఆటోలో ప్రయాణించిన ఇద్దరు మహిళలు తోసివేసి, ఆమె చేతిలో ఉన్న హ్యాండ్ బ్యాగుతో సహా 9 తులాల బంగారు ఆభరణాలు తీసుకొని పరారయ్యారని సిఐ బి.వెంకటరావు తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జె.తారకేశ్వరరావు విచారణ చేపట్టి నేరానికి పాల్పడిన ఇద్దరు మహిళలను వంగర మండలం పోతుల గుమ్మ గ్రామానికి చెందిన ఆవుల పార్వతి, కొత్తవలస 202 కాలనీకి చెందిన గంటా మీనా గా గుర్తించినట్లు తెలిపారు. నిందితులు చోరీ సొత్తును అమ్మేందుకు నగరంలో శనివారం తిరుగుతుండగా అరెస్టు చేసి, వారిని పట్టుకొని 9 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు సిఐ తెలిపారు.ఫిర్యాదుదారులైన సునీత కెఎల్‌పురంలో ఉన్న తన అక్క కూతురు ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కినట్లుగా ఆయన తెలిపారు. నేరం జరిగి, ఫిర్యాదు చేసిన 5 గంటల వ్యవధిలోనే వన్ టౌన్ క్రైం బందం నిందితులను గుర్తించి, అరెస్టు చేసి, రికవరీ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందిని సిఐ అభినందించారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని అరసాడ సెంటర్ వద్ద మద్యం బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై వైవి జనార్ధన్ శనివారం తెలిపారు. రేగిడి మండలం ఉణుకూరు గ్రామానికి చెందిన వ్యక్తి పది మద్యం బోటాల్ల తో పట్టు పడడంతో ఆ వ్యక్తి పై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

జూనియర్ కాలేజీలో దొంగలు పడ్డారు..

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దొంగలు పడ్డారు. కళాశాలకు వేసవి సెలవులు ఇవ్వడంతో తాళాలు వేశారు. శుక్రవారం రాత్రి ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి గేటు ఎదురుగా ఉన్న మేడ పైన ఉన్న రూము తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించి ఫ్యాన్ వేసుకుంటూ కాసేపు గడిపారు. ఆ గదిలో ఏ విధమైన వస్తువులూ లేకపోవడంతో వారు నిష్క్రమించినట్లు తెలుస్తోంది. ఇది దొంగల పనా, వేరే ఉద్దేశ్యంతో చెడు వ్యసనాలకు పాల్పడిన గ్యాంగ్ ఈ గదిని వినియోగించుకుందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కళాశాలలో ప్రభుత్వం నైటు వాచెమేన్‌ను కూడా నియమించింది. కళాశాలకు నాడు- నేడు కింద ఇటీవలే ప్రధాన ద్వారం వద్ద పెద్ద గేటును కూడా అమర్చి ప్రహరీని కూడా నిర్మించారు. ప్రధాన రహదారి విస్తీర్ణం పనుల్లో భాగంగా కాలేజీ ప్రధాన గేటుకు కుడివైపున మార్కెట్ యార్డు గోడను అనుసరించి ప్రహరిని కాంట్రాక్టర్లు కొంతవరకు తొలగించారు. తొలగించిన ఆ మార్గాన్ని నేటి వరకు నిర్మించకపోవడంతో ఆ మార్గం గుండా కొందరు ఆకతాయికులు ప్రవేశించి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడి ఉండవచ్చునని కొందరు అభిప్రాయపడుతున్నారు. దీనిపై నిఘాపెట్టి ఇటువంటి భవిష్యత్తులో జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని చందాపురం గ్రామ శివారులో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊటను శనివారం ధ్వంసం చేసినట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు చేసినట్లు చెప్పారు.

అంబేద్కర్ జయంతిని జయప్రదం చేయండి

వంగర : నేడు జరగబోవు భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతిని జయప్రదం చేయాలని దళిత సంఘాల జెఎసి నాయకులు మజ్జి గణపతి, యమ్. గణపతి రావు, చిత్తిరి గంగులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు వంగరలో విలేకరులతో మాట్లాడుతూ నిమ్న కులాల అభ్యున్నతి కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన చిన్ననాటి నుండి ఎన్నో పోరాటాలు చేశారన్నారు. బడుగు బలహీన వర్గాలను మను, చాందసవాదుల కోరల నుంచి విడిపించడానికి తన కుటుంబాన్ని విడిచిపెట్టి తన జీవితాన్ని దారపోసారని ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో నాయకులు డి. రాంబాబు, చిన్న, జమ్మయ్య దివాకర్, బుజ్జి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో కవితలు వినిపిస్తున్న రాజన్నదొర


బొబ్బిలి పట్టణంలో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు, బేబినాయన


కూనేరు సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

రాజన్నదొర నోట కవితలు, పాటలు

సమావేశాల్లో కేడర్ ఉత్తేజానికి ప్రయత్నం

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొర నోటి వెంట ఇటీవల కాలంలో తరచూ పాటలు, కవితలు వినిపిస్తున్నాయి. కార్యకర్తలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశాల్లో కేడర్‌ను ఉత్సాహపరిచేందుకు సొంతంగా రాసుకున్న కవితలు చదువుతున్నారు. పొత్తులతో వస్తున్నారు మాయగాళ్ల జాగ్రత్త, హామీలిచ్చి మోసం చేసే బాబులున్నారు జాగ్రత్త అంటూ కవిత చదువుతున్నారు. గత మోసాలు గుర్తు తెచ్చుకో, ఫ్యాన్ గుర్తు గుర్తుపెట్టుకో అని చెపుతూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్నారు. తెలంగాణాకు చెందిన గద్దర్ పాడిన పాట కూడా తరచుగా పాడుతూ జనాలను, కార్యకర్తలను ఉర్రూతలూగిస్తున్నారు. జెండాలు జత కట్టడమే మీ అజెండా, జనం గుండెల్లో గుడి కట్టడమే జగను అజెండా అని నల్గొండ గద్దర్ పాడిన పాట సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఆ పాటను పాడుతూ కార్యకర్తలు, నాయకులను ఉత్తేజపరుస్తున్నారు.

అభివృద్ధి చేయడంలో వైసిపి విఫలం

మాజీమంత్రి సుజయ్‌కృష్ణ

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గ అభివృద్ధిలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా తెలిపారు. పట్టణంలోని తారకరామ కాలనీలో శనివారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయనతో కలిసి శనివారం వారు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల పక్షాన పని చేసే బేబినాయనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి పని చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారం చేసిన నాయకులకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, బాబు పాలూరి, నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి - కొమరాడ

నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ సిపిఎం తరపున పోటీ చేసే ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని కూనేరు సంతలో శనివారం ఎర్రజెండా తరుపున పోటీ చేసిన ఎమ్మెల్యే మండంగి రమణ, ఎంపి పి.అప్పలనర్స అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని సంతలో ప్రసారం చేశారు. సిపిఎం తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఎం.రమణ, ఈనెల 23న కురుపాంలో నామినేషన్ వేస్తున్న సందర్భంగా గిరిజనులంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గిరిజన గ్రామాల్లో ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పైన ఎల్లవేళల ప్రభుత్వ విధానాలపై పోరాడుతున్న మండంగి రమణ, పాచిపెంట అప్పల నర్స పోటీ చేస్తున్నారని, వీరిద్దరిని అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.



బొబ్బిలి పట్టణం అప్పయ్యపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి ; కొత్తవలసలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

హామీల అమలు ఘనత మాదే : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేసిన ఘనత తమదేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. మున్సిపాలిటీలోని అప్పయ్యపేటలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి న్యాయం చేసిన వైసిపికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే, ఆయన కుమారుడు శంబంగి శ్రీకాంత్, సోదరుడు శంబంగి వేణుగోపాల్ మూడు బృందాలుగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కొత్తవలస : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందరికీ చేరాలంటే మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్యే కబుడండి శ్రీనివాసరావు కోరారు. శనివారం మండలంలో కొత్తవలస-202 కాలనీ, దెందేరు, గనిశెట్టిపాలెం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. పేదల పక్షాన నిలిచిన వైసిపికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి బొంతల వెంకటరావు, మేలాస్త్రీ అప్పారావు, కొత్తవలస, గనిశెట్టిపాలెం, చినరావుపల్లి సర్పంచులు రామస్వామి, జామి ఈశ్వరరావు, బుసల దేముడు, పిఎస్ఎన్ పాత్రుడు, మాధవరావు, విరోతి కొండలరావు, ఎంపిటిసి వెలగల వెంకటరమణ, బి.ఎ.నాయుడు, లెంక వెంకన్నపాత్రుడు తదితరులు పాల్గొన్నారు

చీపురుపల్లి: సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని వైసిపి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా

విస్తృతంగా వైసిపి ప్రచారం

కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడులు ప్రజలను కోరారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌లు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అలజంగి సర్పంచ్ రఘుమండ త్రినాధరావు, పేరిపి సర్పంచ్ కోరా పృధ్వి, కోరాడ నారాయణరావు, కరణం చిన్నంనాయుడు, రేవల్ల సత్యన్నారాయణ, ముల్లు ఈశ్వరరావు, బవిరి రవి, రాము, మహాలక్ష్మనాయుడు, మంగరాజు, సోసల్ మీడియా కన్వీనర్ మొండేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగలో వైసిపి ఎన్నికల ప్రచారం

పూసపాటిరేగ : మరోసారి అవకాశం ఇవ్వాలని నెల్లిమర్ల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డకొండ అప్పలనాయుడు, జిల్లా వైసిపి కోశాధికారి కందులు రఘుబాబు, చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షులు సిరి సహస్ర కోరారు. శనివారం పూసపాటిరేగలో వైసిపి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యే తనను, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ను, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, ఎన్. సత్యనారాయ రాజు, నాయకులు మహంతి జనార్ధనరావు, పిఎసిఎస్ చైర్మన్ మహంతి లక్ష్మణరావు, సర్పంచి టొంపల సీతారాం, బొల్లు రమేష్, దాడిశెట్టి త్రినాదరావు తదితరులు పాల్గొన్నారు.


బొండపల్లి : కెరటాంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్

సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం : కొండపల్లి


పలుచోట్ల ప్రచారం

ప్రజాశక్తి-బొండపల్లి

వైసిపి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలో నెలివాడ, కెరటం గ్రామాలలో ఉపాధి హామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారికి సకాలంలో పని వేతనం , కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందా? అని అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని వడగాల్పులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం దివాలా తీసిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి టిడిపి కట్టుబడి ఉందని ఆయన స్పష్టంచేశారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాలతోనే ప్రజలు కష్టాలు తీరుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కెరటాం సర్పంచ్ నంబూరి రాజేష్, నెలివాడ మాజీ సర్పంచ్ హైమావతి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి మాధవి ఇంటింట ప్రచారం

పూసపాటిరేగ : గెలుపే ధ్యేయంగా ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి లోకం మాధవి మండలంలోని గోవిందపురం, భరణికాం, లంకలపల్లి పాలెంలో టిడిపి నాయకులతో కలిసి శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. భరణికాం చెరువులో ఉపాధి పనులు చేస్తున్న మహిళలతో మాట్లాడారు. తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కూటమిని గెలిపించుకోవాలన్నారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థి మాదవమ్మను గెలిపించాలని టిడిపి నాయకులు ప్రచారం చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నం నాయుడు, నాయకులు దంగా భూలోకా, సింహాచలం, ఆకిరి ప్రసాదరావు, దంతులూరి సూర్యనారాయణరాజు, పసుపులేటి శ్రీనివాస రావు, జనసేన మండల అధ్యక్షులు జలపారి శివ, పతివాడ శ్రీను, పులపా మల్లేశ్వర్రావు, నక్కాన రమణ, బాలా అప్పలరాజు, శంకాభత్తుల సత్తిబాబు, మహంతి శివ, రౌతు నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు : చీపురుపల్లిలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు


పూసపాటిరేగ : భరణికాంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జనసేన అభ్యర్థి మాధవి



నియోజకవర్గ ముఖచిత్రం


నియోజకవర్గం పరిధిలో పార్వతీపురం అర్బన్, రూరల్, బలిజిపేట, సీతానగరం మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 1,87,854మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 92,655మంది, స్త్రీలు 95,188 ఇతరులు11 ఉన్నారు. 1967 తర్వాత నియోజకవర్గాల విభజన అనంతరం పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన 13 ఎన్నికలలో 6సార్లు టిడిపి, 3సార్లు కాంగ్రెస్, స్వతంత్ర్య పార్టీ 1, ఇండిపెండెంట్ 1చ జనతా1, వైసిపి ఒకసారి గెలుపొందాయి.

ఎమ్మెల్యేల వివరాలు

1967	మరిశర్ల వెంకటరామినాయుడు	(స్వతంత్రపార్టీ)
1972	చీకటి పరశురాం నాయుడు	(ఇండిపెండెంట్)
1978	చీకటి పరశురాం నాయుడు	(జనతాపార్టీ)
1983	మరిశర్ల వెంకటరామినాయుడు	(టిడిపి)
1985	మరిశర్ల వెంకటరామినాయుడు	(టిడిపి)
1989	యర్రా కృష్ణమూర్తి నాయుడు	(టిడిపి)
1994	యర్రా కృష్ణమూర్తి నాయుడు	(టిడిపి)
1996	యర్రా అన్నపూర్ణమ్మ ఉప ఎన్నిక	(టిడిపి)
1999	మరిశర్ల శివున్నాయుడు	(కాంగ్రెస్)
2004	శత్రుచర్ల విజయరామరాజు	(కాంగ్రెస్)
2009	సవరపుజయమణి	(కాంగ్రెస్)
2014	బొబ్బిలి చిరంజీవులు	(టిడిపి)
2019	అలజంగి జోగారావు	(వైసిపి)

పార్వతీపురం నియోజకవర్గం జిల్లాకు కేంద్రమైనప్పటికీ అభివృద్ధికి మాత్రం ఆమడ దూరం . ఈ నియోజకవర్గాన్ని పరికించిచూస్తే విభిన్న సంస్కృతుల సమాహారంగా కనబడుతుంది. ఒడిషా సరిహద్దును ఆనుకొని ఉండడంతో పాటు, ఒక్కప్పుడు ఈ ప్రాంతం జయపురం మహారాజుల ఏలుబడిలో ఉండడం, ఆ తర్వాత జమిందార్ల పాలన వల్ల ఒడిషా జీవన సంస్కృతులు, భాషావైవిధ్యం, ఇక్కడ ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. పార్వతీపురం మండలానికి అనుకుని ఉన్న గిరిజన గ్రామల ప్రజలు కూడా ఎక్కువగా ఒడియా భాష మాట్లాడటం ఇక్కడ ప్రత్యేకత.

జిల్లా కేంద్రం.. అభివృద్ధికి దూరం



ఇదీ పార్వతీపురం నియోజకవర్గ ముఖచిత్రం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఏజెన్సీ మండలాలకు ముఖద్వారంగా పార్వతీపురం పట్టణం ఉండడంతో ఆదివాసీలతో పాటు ఇతర ప్రాంత ప్రజలకు ప్రధాన వ్యాపార కేంద్రంగా మారింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటుగా ఐటిడిఎ కార్యాలయం కూడా ఉండడంతో పరిపాలనా కేంద్రంగా విలసిల్లుతుంది. అన్ని ప్రాంతాలనూ అనుసంధిస్తూ రైల్వేస్టేషన్లు, జిల్లా కోర్టు, కేంద్ర ఆసుపత్రి కూడా పట్టణంలోనే ఉన్నాయి. దీంతో జిల్లా నలుమూలలకు చెందిన ప్రజలు తమ అధికార కార్యక్రమాలతో పాటు, దినసరి వ్యవహారాలతో నిత్యం నియోజకవర్గ కేంద్రానికి రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఉపాధి అవకాశాల కోసం చుట్టపక్కల గ్రామల నుంచి శ్రమజీవులు పట్టణంపైనే ఆధార పడుతుంటారు. నియోజక వర్గం చుట్టూ జంఝావతి, నాగావళి, సువర్ణముఖి నదులు ప్రవహిస్తుండడం వల్ల ఎక్కువ మంది కర్షకులు వ్యవసాయమే ప్రధాన జీవనం సాగిస్తున్నారు. నదులను సద్వినియోగం చేసుకుని ఆనకట్టలు లేకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తుండగా, రైతులు వర్షాధారంగానే పంటలు పండించే పరిస్థితి. భౌగోళికంగా రాష్ట్రానికి శివారులో ఉండడం వల్ల అభివృద్ధిలో కూడా ఆఖరులో నిలిచింది. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధి కల్పించాల్సిన పాలకుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గం పారిశ్రామికంగా ఒక్క అడుగువేయలేకపోయింది. నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలో ఒక్కంటంటూ ఒక్క పరిశ్రమ ఆనవాళ్లు కనబడకపోవడం ఇక్కడి ప్రత్యేకత. పరిశ్రమల్లేక పోవడంతో వ్యవసాయంపైనే ప్రజలు ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి. పట్టణంలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకోడానికి గుజరాతీలు, మార్వాడీలు జిల్లా కేంద్రానికి తరలిరావడంతో నియోజకవర్గం వివిధ రాష్ట్రాల ప్రజలతో భిన్న సంస్కృతులతో విరజిల్లుతుంది.


పార్వతీపురం పట్టణం

నియోజకవర్గంలో పార్వతీపురం, సీతానగరం మండలాలకు సాగునీరు అందించేందుకు జంఝావతి జలాశయం నిర్మాణం చేపట్టి 50 ఏళ్లుగా పనులు జరుగుతున్నప్పటికీ లక్ష్యం మాత్రం ఇసుమంతకూడ నెరవేరక, సాగునీటి కోసం ప్రజలకు ఎదురు చూపులు తప్పడంలేదు. సీతానగరంలో పెద అంకలాం ఆనకట్ట, తోటపల్లి పిల్లకాలువల నిర్మాణాలు లేక సాగునీరందక రైతులు విలవిలాడుతున్నారు. ఇక విద్యారంగంలో కూడా నానాటికీ తీసికట్టుగానే ఉంది. విద్యాలయాలు ఏర్పాటు చేసి యువతను విద్యావంతులుగా మార్చాల్సిన ఈ ప్రాంతంలో ప్రభుత్వ యాజమాన్యంలో ఎప్పుడో తాతలకాలంలో ఏర్పాటైన ప్రభుత్వం జూనియర్ కళాశాల తప్ప, డిగ్రీ, పిజీ కళాశాలలు ఏ ఒక్కటీ ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం ఉన్న శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలను ఇటీవలనే ప్రభుత్వం కళాశాలగా లాంఛనంగా మార్చారే తప్ప ప్రభుత్వ కళాశాలకు ఉండాల్సిన వనరులు పూర్తి స్థాయిలో సమకూర్చలేదు. కనీసం ఒక్క ఇంజినీరింగ్ కాలేజీ లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిలువుట్టడం. దీని వల్ల విద్యార్థులు ఉన్నత చదువులను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి వరహాలు గెడ్డ పార్వతీపురం పట్టణం గుండా ప్రవహించడంతో ప్రతి ఏటా ముంపు పట్టణానికి పెద్దసమస్యగా మారుతుంది. పట్టణం నడిబొడ్డున ఈ గెడ్డ ప్రవహించడంతో వ్యర్థపదార్థాలకు నిలయమంగా మారి మురికి కూపంగా నిత్యం కాలుష్యాన్ని వెదజల్లుతూనే ఉంది.

వైద్య పరంగా పేదలకు పెద్దదిక్కుగా మారిన జిల్లా కేంద్ర ఆసుపత్రి 200 పడకలకు అప్‌గ్రేడేషన్ అయినప్పటికీ, స్థలం కొరత వేధిస్తూ, విస్తరణకు నోచుకోవడంలేదు. అట్టహాసంగా ప్రారంభించిన సూపర్ స్పెషాలిటీ అసుపత్రి పునాది దశలోనే ఉంది. ఇది ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. బలిజిపేట, సీతానగరం మండలాల ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉండే నారాయణపురం, గెడ్డలుప్పి వంతెనల నిర్మాణాలు పూర్తి కావచ్చినా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి ఇప్పటి ప్రభుత్వం విఫలమైంది. లచ్చయ్యపేట చెరకు కర్మాగారం మూతపడడంతో చెరకు సాగు చేసే రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పార్వతీపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తీర్చడానికి వెంకంపేట ఘోరీల నుండి కృష్ణపల్లి, ఎల్ఎన్‌పురం మీదుగా విక్రమపురం వరకు ప్రత్యామ్నయ రహదారి నిర్మాణానికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిపాదనలు చేసినా, ప్రస్తుత ప్రభుత్వం అలాంటి ఉద్దేశం ఏమీలేనట్లుగా వ్యవహరించింది. నియోజకవర్గం అభివృద్ధిలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఎలా నిర్లక్ష్యం ప్రదర్శించిందో, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం కూడా అభివృద్ధి మాటే మరిచిపోయింది. దీనికి తోడు గత ఐదేళ్లలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు కబ్జాల బారిన పడి, రాజకీయ నాయకుల దోపిడికీ గురయ్యాయి.

పారిశ్రామిక అభివృద్ధి ఏదీ?

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధి కల్పించాల్సిన పాలకుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గం పారిశ్రామికంగా ఒక్క అడుగువేయలేకపోయింది. నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలో ఒక్కంటంటూ ఒక్క పరిశ్రమ ఆనవాళ్లు కనబడకపోవడం ఇక్కడి ప్రత్యేకత.

కలుస్తారా? కలబడతారా??

ప్రజాశక్తి -పాలకొండ


పడాల భూదేవి



నిమ్మక జయకృష్ణ

కూటమి అభ్యర్థిగా నిమ్మక జయకృష్ణను ప్రకటించడంతో టిడిపిలో మరో గ్రూపు భగ్గుమంది. మొదటి నుంచీ జయకృష్ణకు వ్యతిరేకంగా వచ్చిన వారంతా పడాల భూదేవికి టికెట్ ఇవ్వాలని గట్టిగానే పట్టు పట్టారు. జయకృష్ణకు టికెట్ ఇస్తే తాము వ్యతిరేకిస్తామని బహిరంగంగానే కొంతమంది నాయకులు ప్రకటించారు. పొత్తులో భాగంగా పాలకొండ సీటు జనసేనకు కేటాయించడంతో, జనసేన తరుపున కూడా భూదేవికి కావాలని జయకృష్ణను వ్యతిరేకించిన నాయకులు సామంతుల దామోదరరావు, కండాపు జ్యోతి, కండాపు వెంకట రమణ, వారాడ సుమంత్ నాయుడు, గుమ్మిడి సింహాద్రి, తదితరులు పట్టుపట్టారు. అయితే జనసేన టికెట్ జయకృష్ణకు కేటాయించడంతో నేతలంతా అసంతృప్తి చెందారు. జయకృష్ణకు వ్యతిరేకంగా సమావేశం కూడా ఏర్పాటు చేశారు. టికెట్ విషయంలో కూటమి పార్టీలు పునరాలోచన చేయాలని సమావేశంలో ప్రకటించాయి. అయితే జయకృష్ణ అభ్యర్థి అయితే వీరెంత వరకు సహకరిస్తారని రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతుంది. జయకృష్ణను మార్చే ప్రసక్తి లేదని, జయకృష్ణ వ్యతిరేక వర్గీయులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

పిరిడి నుంచి ముచ్చటగా ముగ్గురు

ప్రజాశక్తి-బొబ్బిలి


కొల్లి వెంకటకూర్మినాయుడు


పెద్దింటి రామస్వామినాయుడు


జగన్మోహనరావు

జిల్లాలో బొబ్బిలి మండలంలో ఉన్న పిరిడి గ్రామానికి ఒక చరిత్ర ఉంది. ఈ గ్రామం నుంచి ముచ్చటగా ముగ్గురు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. గ్రామానికి చెందిన కొల్లి వెంకటకూర్మినాయుడు నిస్వార్థ రాజకీయాలకు చిరునామాగా మారి, ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసుకున్నారు. 1952లో బొబ్బిలి నియోజకవర్గం నుంచి సోషలిస్టు పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఘనవిజయం సాధించారు. చింతాడ సమితి అధ్యక్షులుగా పదేళ్ళపాటు కొనసాగారు. 1978లో వచ్చిన సార్వత్రిక ఎన్నికల్లో జనతా పార్టీ తరపున పోటీ చేసి మరోసారి విజయం సాధించారు. నిస్వార్థంగా ప్రజలతో మమేకమై వారి మన్ననలు పొందారు. ఆయన చేస్తున్న ప్రజాసేవను తెలుసుకున్న అప్పటి గవర్నర్ సింగ్ ఎంతగానో మెచ్చుకున్నారు.

1983 ఎన్నికలలో ప్రస్తుత ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అసెంబ్లీకి పోటీ చేసినప్పుడు ఆయనకు మద్దతునిచ్చారు. ఆ ఎన్నికల్లో శంబంగి గెలుపొందారు.

అదే గ్రామానికి చెందిన పెద్దింటి కుటుంబం నుంచి తండ్రి, కొడుకు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1955లో బలిజిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పెద్దింటి రామస్వామినాయుడు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన కుమారుడు పెద్దింటి జగన్మోహన రావు 1989లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. జగన్మోహనరావు ఎంబిబిఎస్ పూర్తిచేసి, బొబ్బిలిలో ఆస్పత్రి ఏర్పాటు చేసి, వైద్యసేవలందించారు. అటవీశాఖా మంత్రిగా కూడా ఆయన పనిచేశారు.



కలిశెట్టిని సన్మానిస్తున్న కర్రోతు సత్యనారాయణ

కర్రోతును కలిసిన కలిశెట్టి

ప్రజాశక్తి - భోగాపురం

మండల టిడిపి అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణను విజయనగరం కూటమి ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు శనివారం రాత్రి పోలిపల్లి గ్రామంలోని ఆయన ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన గెలుపునకు కృషి చేయాలని సత్యనారాయణను కోరారు. అనంతరం సత్యనారాయణ అప్పలనాయుడును శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి కర్రోతు రాజు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎన్నికల్లో నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని పాలకొండ సిఐ ఎం.చంద్రమౌళి ప్రజలకు సూచించారు. శనివారం మండలంలోని నడిమికెళ్లలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో తగాదాలు, కొట్లాటలకు ప్రోత్సహించకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు తమ వంతు బాధ్యత వహించాలన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ ఎస్.కె ఫక్రుద్దీన్, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జయకృష్ణను మారిస్తేనే పనిచేస్తాం

యశస్విని ముందు నాయకుల స్పష్టీకరణ!

ప్రజాశక్తి-పాలకొండ

ఎన్‌డిఎ కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా జనసేన తరపున జయకృష్ణకు టికెట్ కేటాయించిన వెనువెంటనే అసమ్మతి స్వరం తీవ్రమైంది. దీంతో జనసేన నాయకత్వం రంగంలోకి దిగినట్లు తెలుస్తుంది. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని శనివారం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. సమస్యను పరిష్కరించేందుకు ఆమె ప్రయత్నించినా అందుకు అసమ్మతి నాయకులు ససేమిరా అన్నట్టు సమాచారం. ముందుగా టిడిపి ముఖ్య నాయకులు సామంతుల దామోదరరావు, వారాడ సుమంత్ నాయుడు, ఖండాపు వెంకటరమణ, గుమ్మడి సింహాద్రి తదితరులతో మాట్లాడారు. జయకృష్ణ సమర్థమైన వ్యక్తి కాదని, ఎవరిని కలుపుకుని వెళ్లే పరిస్థితి లేదని ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పాలకొండ మండలంలో ప్రచారం జరుగుతున్నా తమను కనీసం పిలవలేదని, తమను కలుపుకుని వెళ్లడం లేదని చెప్పినట్టు తెలిసింది. అలాగే జయకృష్ణ అభ్యర్థి అయితే తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించమని స్పష్టం చేసినట్లు తెలుస్తుంది. అదే విధంగా జనసేన నాయకులు నిమ్మల నిబ్రం, కూరంగి నాగేశ్వరరావు తదితరులు తమను పట్టించుకోవట్లేదని, తామంతా జయకృష్ణ వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారని భోగట్టా. అయితే ఎజయకృష్ణ పార్టీ నాయకులతో కలుపుకుని వెళ్తానని చెప్పినట్లు సమాచారం. అయితే ఇంత వ్యతిరేకత ఉండడంతో పార్టీ ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ఎస్‌పితోనే అభివృద్ధి

ప్రజాశక్తి - భోగాపురం

సమాజ్‌వాది పార్టీతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం అభ్యర్థి కర్రి కృష్ణ అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే నెల్లిమర్ల నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. సమాజంలో ఉన్న అన్ని వర్గాలను ఆదుకుంటామని తెలిపారు. సమాజ్ వాది పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ అచ్చియ్య నాయుడు సామి రెడ్డి, నెల్లిమర్ల అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నాని తెలిపారు. మీ అమూల్యమైన ఓటు సైకిల్ పంపుపై వేసి గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే కార్మికవర్గ కర్తవ్యం

ప్రజాశక్తి - సీతంపేట

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకొని రాజ్యాంగంలో కార్మికులకు పొందుపర్చిన హక్కులను నాశనం చేస్తున్న వారికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేలా కార్మిక వర్గం తీర్పునివ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దావాల రమణారావు, వై.మన్మధరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల కార్యదర్శి ఎం.కాంతారావు అధ్యక్షతన జరిగిన కార్మిక వర్గం, సార్వత్రిక ఎన్నికలు, కర్తవ్యం అనే అంశంపై జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. కేంద్రంలో మోడీ తిరిగి అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదని, కార్మిక వర్గం, గిరిజన హక్కులు హరించబడతాయని, రాబోయే సార్వత్రిక ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని అన్నారు. భారత రాజ్యాంగం ధ్వంసం చేసే చర్యలు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే పరిస్థితులు ఏర్పడతాయని, బిజెపిని, దాని తొత్తు పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. వివిధ రంగాలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మక్కువ: రానున్న ఎన్నికల్లో బిజెపి, దాని తొత్తు పార్టీలను ఓడించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పిలుపునిచ్చారు. శనివారం మక్కువలో సిఐటియు సమావేశం కృష్ణ, దానమ్మ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన వాగ్దానాల అమలులో విఫలమయ్యాని విమర్శించారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటు వేదికగానే కార్మిక చట్టాలపై దాడి చేసిందని, దీనికి రాష్ట్రంలోని పాలకులు వంత పాడారని ప్రతిపక్ష పార్టీలు కూడా బిజెపి విధానాలకు అడ్డుచెప్పని పరిస్థితిలో ఉన్నాయని విమర్శించారు. అందుకే రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు వారి వారి మేనిఫెస్టోలో కార్మికుల సమస్యలపై ఏం చేస్తారో తెలియజేయాలని సిఐటియు అన్ని పార్టీలను కోరుతుందన్నారు. అనంతరం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డాక్టర్ అంబేద్కర్ ఇచ్చిన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న శక్తులకు వ్యతిరేకంగా కార్మిక వర్గం నిలబడి పోరాడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు జ్యోతి, గౌరీశ్వరి, ప్రభాకర్, రామారావు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



మక్కువ : సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు

సాలూరురూరల్ :కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని వీటిని తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఏకం కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని మామిడిపల్లిలో శశికళ ఆధ్వర్యంలో సిఐటియు విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, నాయకులు రాజేశ్వరి, నారాయణమ్మ, పుష్ప, జానకి, కుమారి పాల్గొన్నారు.

వీరఘట్టం : భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే బిజెపి దాని మిత్రపక్షాలను ఓడించాలని సిపిఎం మండల నాయకులు సింహాచలం పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించే దిశగా ఈనెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు పట్నాలోనూ, అన్ని గ్రామాల్లోనూ నిర్వహించాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాం గాన్ని ధ్వంసం చేస్తున్న బిజెపి దాని మిత్రపక్షాలను ఓడించడమే ఎస్‌టి, ఎస్‌సి, బిసి, మహిళా, మైనార్టీ, కార్మిక, కర్షకులు, అంబేద్కర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల నాయకురాలు సిహెచ్ చిన్నమ్ముడు తదితరులు, పాల్గొన్నారు.

దోచుకోవడమే జగన్ విధానం

ప్రజాశక్తి - గుర్ల

రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోని ముఖ్యమంత్రి జగన్ దోచుకోవడం, దాచుకోవడమే విధానంగా పనిచేస్తున్నారని మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు విమర్శించారు. మండలంలోని ఎస్‌ఎస్ఆర్ పేట, మన్యంపురి పేట, దమరసింగి, వల్లాపురంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యపాన నిషేధమని చెప్పి, మద్యం పేరిట కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. ధరలను స్థిరీకరిస్తామని చెప్పి, అందుకు వ్యతిరేకంగా ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. కావున రానున్న ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పి టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, మాజీ ఎంపిపి వి.నన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్.మహేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో టిడిపి ప్రచారం

పార్వతీపురంరూరల్ : మున్సిపాలిటీ పరిధి 30వ వార్డులో శనివారం, టిడిపి అభ్యర్థి బోనెల విజయచంద్ర బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జనసేన కన్వీనర్ చందక అనిల్ కుమార్‌తో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులతో కలిసి ఆయా వార్డుల్లో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సొండి సంజీవి, జనసేన నాయకులు చందక అనిల్ కుమార్, ఆగూరు మణి, టిడిపి నాయకులు బడే గౌరినాయుడు గొట్టాపు వెంకట నాయుడు, బార్నాల సీతారాం, బోను చంద్రమౌళి, గుంపస్వామి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

పార్వతీపురం పట్టణానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు డాక్టర్ చీకటి బద్రినారాయణరావు, ఆయన సోదరులు అప్పల నరసింహారావు, డాక్టర్ బాలచంద్ర విద్యార్థిరావు మాజీ మంత్రి సుజయ కృష్ణరంగారావు, బోనాల విజయచంద్ర సమక్షంలో శనివారం టిడిపి పార్టీలో చేరారు. వైసిపి ప్రజా వ్యతిరేక పాలనను తాము వ్యతిరేకిస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

చీకటి పేటలో బేబినాయన ఎన్నికల ప్రచారం

తెర్లాం : మండలంలోని చీకటిపేటలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీ నాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఆ గ్రామ సర్పంచ్ ఎం పార్వతి, మాజీ ఎంపిటిసి చీకటి చంద్రావు, మూడడ్ల కిరణ్ కుమార్, బేబీ నాయక్ పాల్గొని స్వాగతం పలికారు. బేబినాయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను తన గెలిచిన తరువాత పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకటనాయుడు, ఎన్.వెంకటేశ్వరరావు, అమరాపు సురేష్, జి ఆనంద్, ఎంపిటిసి, మాజీ సర్పంచ్ శశి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార సభలో కళావెంకట్రావు




గుర్ల మండలంలో ప్రచారం చేస్తున్న కళా వెంకటరావు

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గం జనసేన అసెంబ్లీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. మండలంలోని హద్దుబంగి పంచాయతీకి చెందిన మందపాటి ప్రభు, కుమార్రాజు కుమార్ నేతృత్వంలో గ్రామస్థాయి సభ్యులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరికి జనసేన పార్టీ కండువా వేసి నిమ్మక జయకృష్ణ పార్టీకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజలు ఉమ్మడి పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. నాయకులు కుమార్ మాట్లాడుతూ జనసేన అభివృద్ధికి క్షేత్రస్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





పార్వతీపురంలో మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు ; సీతంపేటలో జనసేనలో చేరిన నాయకులకు కండువా వేస్తున్న జయకృష్ణ

పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సాలూరు

పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. సాధారణ ఎన్నికల నిర్వహణలో లోపాలు, నిర్లక్ష్యం లేకుండా ప్రశాంతంగా జరిగేందుకు శిక్షణను సద్వినియోగం చేసుకుని సమర్థంగా విధులు నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాలూరు నియోజకవర్గ ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సిన ప్రవర్తనా నియమావళి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధుల నిర్వహణ తదితర అంశాలపై అందిస్తున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తశుద్ధితో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని భావించి ఎటువంటి ఆరోపణలు లేకుండా స్వేచ్ఛగా ప్రశాంతంగా జరిగేలా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్, సెక్టార్ అధికారులు కీలకమన్నారు. ఎక్కడా ఎటువంటి లోపాలు తలెత్తకుండా ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు ఏమైనా అనుమానాలు ఉంటే శిక్షణలో పూర్తి స్థాయిలో నివృత్తి చేసుకోవాలని అన్నారు. మాక్ పోలింగ్ మొదలుకొని స్ట్రాంగ్ రూములో ఇవిఎంలు భద్రపరిచే వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై పలు సూచనలు చేశారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ప్రిసైడింగ్ అధికారి డైరీ రాయడం, ఫారం 17 సి నింపడం వంటి చర్యలపై శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సెక్టార్ అధికారులు సైతం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియ పైనా, ప్రిసైడింగ్ అధికారుల విధులు పైనా సెక్టార్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని, వారికి తలెత్తే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసే స్థాయిలో ఉండాలని ఆదేశించారు. మాక్ పోలింగ్ ను పరిశీలించారు. స్ట్రాంగ్ రూం లను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, సాలూరు నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి సి.విష్ణుచరణ్, తహశీల్దార్లు, సెక్టార్, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

కురుపాం : శిక్షణను సద్వినియోగం చేసుకుని ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. స్థానిక మోడల్ స్కూల్లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సందర్శించి ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సిన ప్రవర్తనా నియమావళి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులు నిర్వహణ తదితర అంశాలపై అందిస్తున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల సమయంలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పాలకొండ ఆర్‌డిఒ, కురుపాం ఆర్ఒ వి.వెంకటరమణ, తహశీల్దార్లు, సెక్టార్, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో ఎన్నికల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సీతంపేట : ఎన్నికలకు సంబంధించి పోలింగ్ రోజు ప్రిసైడింగ్ అధికారి పాత్ర కీలకమైనదని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇస్తోన్న శిక్షణ తరగతులను ఆర్వో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ పోలింగ్ రోజు పిఒ, ఎపిఒలు చేపట్టవలసిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణలో అన్ని అంశాలను తెలుసుకోవాలన్నారు. మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఇవియం యంత్రాల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజు నిర్దిష్ట సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, మాస్టర్ ట్రైనీలు, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి వెళ్లి ఆరోగ్య తనిఖీలు చేస్తున్న జిల్లా మలేరియా అధికారి జగన్మోహనరావు

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామాల్లో జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన కళ్లికోటలో శనివారం పర్యటించారు. ఫీవర్ సర్వైలెన్స్, డ్రైడే ఏ మేరకు వైద్య సిబ్బంది చేపడుతున్నదీ గ్రామంలో పరిశీలించారు. జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా అని ఆరా తీస్తూ, ఇళ్లల్లో దోమతెరల వినియోగంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. చెత్త తొట్టెలు వినియోగిస్తున్న తీరును పలు షాపుల వద్ద తనిఖీ చేశారు. రోగాలు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమని గ్రామస్తులకు తెలియజేస్తూ, అందరూ డ్రైడే పాటించాలని తద్వారా దోమల వ్యాప్తి చెందకుండా ఉంటాయన్నారు. వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక రోగులతో మాట్లాడి వారి ఆరోగ్యాన్ని పరిశీలించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిశీలన చేశారు. మంచి నీరు ఎక్కువగా తాగాలని, అందువల్ల డీహైడ్రేషన్ చెందకుండా ఉంటామని తెలిపారు. అనంతరం డాక్టర్ జగన్మోహనరావు హెల్త్ వెల్నెస్ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఎంతమంది వస్తున్నారు, నిర్ధారణ పరీక్షల నివేదికలు రికార్డుల్లో పరిశీలించారు. మలేరియా, డెంగీ గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి, జ్వరం తగ్గే వరకూ పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కేంద్రంలో మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, నిర్ధారణ పరీక్షల కిట్లు లభ్యత, వైద్య పరికరాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఒ సూర్యనారాయణ, పిహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది రామకష్ణ, నరేంద్ర, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

527 లీటర్ల నాటు సారా ధ్వంసం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా కేంద్రంలో ఉన్న పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 8 నాటు సారా కేసుల్లో పట్టుబడిన 520 లీటర్ల నాటు సారాను శనివారం కొత్తవలస శివారులో ఉన్న ప్రదేశంలో ఎఎస్‌పి సునీల్ షరైన్, పట్టణ సిఐ పివివిఎస్ఎన్ కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందిచే ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా నాటు సారా తయారు చేసినా, రవాణా చేసినా, అమ్మినా నేరమని అన్నారు. అలాంటి వ్యక్తులను అదుపులోకి తీసుకుని, అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అల్లూరి సీతారామరాజు ఒకేషనల్ కళాశాల నూరు శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - సీతంపేట

విజ్ఞాన విహార్ గుడిలోవకు అనుబంధంగా ఉన్న అల్లూరి సీతారామరాజు ఒకేషనల్ కళాశాల ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంఎల్‌టి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ గోవిందరాజు తెలిపారు. వీటిలో ఆరిక శశిరేఖ ఎంఎల్‌టి 850 మార్కులు సాధించింది. మండంగి సౌజన్య ఎంపిహెచ్‌డబ్ల్యు (ఎఫ్) 805 మార్కులు సాధించారు.



మరమ్మతులకు గురైన రోడ్డు

వంగర ఘాట్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

పలు గ్రామాల గిరిజనుల అభ్యర్థన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం నుంచి వంగరకు వెళ్లే ఘాట్ రోడ్డుకు మరమ్మతులు చేయాలని వంగర, కేసర, కీసరగూడ, డోలుకొన గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారిలో కొంత భాగం కూలిపోవడంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో కోరుకుపోయిన రహదారిని మరమ్మతు చేసి రిటర్నింగ్ వాల్ నిర్మించారని, మట్టి ఫిల్లింగ్ చేసి సిమెంట్ రోడ్డు వేశారని, ఆ తరువాత ఫిల్లింగ్ చేసిన మట్టి కృంగిపోయి సిమెంటు రోడ్డు పగిలిపోయిందని అన్నారు. దీన్ని వెంటనే మరమ్మతు చేయాలని వారు కోరుతున్నారు. పార్వతీపురం నుండి కీసర ఆర్టీసీ బస్సు ఈ రహదారి పైనుంచే వెళ్తుందని,రహదారి మరమ్మతుకు గురవ్వడంతో బస్సు సర్వీసును నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. కావున వెంటనే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ఈ రహదారిని మరమ్మతులు చేయాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.



మందులను పరిశీలిస్తున్న డిఐఒ నారాయణ

ప్రజలకు నాణ్యమైన వైద్యమందించాలి

ప్రజాశక్తి - కురుపాం

వైద్య సిబ్బంది ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్యాన్ని అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎం.నారాయణ అన్నారు. మండలంలోని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో గల రోగుల వివరాలు అందిస్తున్న సేవలపై వైద్యాధికారి బి.ప్రజ్ఞను అడిగి తెలుసుకొని ల్యాబ్ గదిని సందర్శించారు. అనంతరం రోగులకు అందించాల్సిన వైద్యంపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

కలిసిన టిడిపి గ్రూపులు

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గంలో ఉన్న టిడిపి గ్రూపులు ఏకమయ్యాయి. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ ఇన్చార్జి కిడారి శ్రావణ్ ఆధ్వర్యాన శనివారం కురుపాంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఇంతవరకు గ్రూపులుగా ఉన్న నాయకులంతా వేదికపై కలవడం జరిగిందని ప్రతి కార్యకర్త కూడా కష్టపడి పనిచేసి జగదీశ్వరి ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, ఐదు మండలాల కన్వీనర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్తులైన్ల పరిధిలో చెట్టుకొమ్మలు తొలగింపు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

పార్వతీపురం మన్యం జిల్లా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ కుమార్ ఆదేశాలు మేరకు మండల కేంద్రంలోని 33 కెవి లైన్ పరిధిలో విద్యుత్తు లైన్‌లకు ఆనుకుని ఉన్న చెట్లు కొమ్మలను శనివారం తొలగించారు. దీంతో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేశామని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బొంతాడ శంకరరావు తెలిపారు. మండల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్తు సరఫరాచేసే విద్యుత్తు లైన్లు పరిధిలో ఉన్నచెట్లు కొమ్మలను తొలగించామన్నారు. పలుచోట్ల విద్యుత్తు లైన్‌లను సరి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది డొంకాడ రాజు, ఒలేటి గోపి, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది




ఇవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఇవిఎంల కేటాయింపు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ఇవిఎం గోదాంలో నిర్వహిస్తున్న ఇవిఎంల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఇవిఎంలను వివిధ నియోజక వర్గాలకు ఇప్పటికే కేటాయించిన విషయం తెలిసిందే. దీనిలో నియోజకవర్గాలకు వచ్చిన ఇవిఎంల సీరియల్ నెంబర్ల ప్రకారం, వాటిని ఆయా నియోజకవర్గాల వారీగా వేరుచేసి, స్కానింగ్ చేసే కార్యక్రమం ప్రస్తుతం జరుగుతోంది. ఈ ప్రక్రియనే కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఇవిఎమ్‌ల నోడల్ ఆఫీసర్ బి.ఉమాశంకర్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, తహశీల్దారు ధర్మరాజు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ, డిఆర్‌డిఎ, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టిడిపి నాయకులతో కళా వెంకటరావు

వైసిపి పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారు : కళా

ప్రజాశక్తి- చీపురుపల్లి

వైసిపి పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చీపురపల్లి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కళా వెంకటరావు అన్నారు. గరివిడి మండలంలోని ముఖ్య నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారని ఎన్నికలు ఎంత తొందరగా వస్తాయా టిడిపికి ఓటు వేసి గెలిపిద్దామా అని ఎదురు చూస్తున్నారని అన్నారు. అభివృద్ధి కోసం నిరంతర ఆరాటపడే చంద్రబాబునాయుడు కోసం ప్రజలంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేందుకు చేసే పోరాటంలో ప్రజలందరూ కలసి రావాలని కోరారు. నియంత జగన్‌మోహన్‌రెడ్డిని సాగనంపితేనే ఈ రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. సమావేశంలో నాయకులు కిమిడి రాంమల్లిక్‌నాయుడు, గరివిడి మండల నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ వైసిపి వస్తే విధ్వంసమే

సుజయ్‌కృష్ణ రంగారావు

ప్రజాశక్తి-రామభద్రపురం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైసిపి గెలిస్తే రాష్ట్రంలో విధ్వంసం, వినాశనం తప్పదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. బూసాయవలసలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ రాష్ట్రం నుంచి వైసిపి తరిమికొడితేనే మంచి రోజులు వస్తాయన్నారు. గత ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి విధ్వంస పాలనకు జగన్ కారకుడయ్యాడని విమర్శించారు. అందుకే ఓటు అనే ఆయుధంతో వైసిపిని బంగాళాఖాతంలో కలపాలన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టి అన్ని వర్గాల ప్రజలను వెనుకబాటుకు గురిచేశారని ఆరోపించారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్నా, రాష్ట్రం పారిశ్రామికంగా అభివద్ధి చెందాలన్నా చంద్రబాబు అధికారంలోకి రావాలన్నారు.

ఆరుగురు వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని నందిగామ పంచాయతీకి చెందిన ఆరుగురు వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి కి అందజేశారు.

వైసిపి ప్రభుత్వ హయాంలో

ఆస్తిపన్ను అదనపు భారం రూ.10కోట్లు

- రెండేళ్లలో రూ.20కోట్లు భారం
- నగర వాసులపై వైసిపి సర్కారు పిడుగు
- ప్రతి ఏటా 15 శాతం వాయింపు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన విలువ ఆధారిత పన్ను విధింపువల్ల మున్సిపల్, కార్పొరేషన్లలో నివసిస్తున్న ప్రజలపై పెను భారం పడింది. గతంలో ప్రతి మూడేళ్లకు ఒకసారి పన్ను స్థానిక సంస్థల అయిన కార్పొరేషన్, మున్సిపల్ పాలక వర్గాలు నిర్ణయించి, ముందుగా ప్రజలకు నోటీసులు అందజేసి పన్ను వసూలు చేసేవారు. 2022లో వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన విలువ ఆధారిత పన్ను వలన విజయనగరం ప్రజలపై ఏడాదికి పది కోట్ల రూపాయల పైన అదనంగా పన్ను భారం పడుతుంది. 2022కు ముందు నగర పాలక సంస్థకు నగరంలో ఆస్తి పన్ను డిమాండ్ ఏడాదికి రూ.22 కోట్లు పైన ఉంటే విలువ ఆధారిత పన్ను కారణంగా గత ఏడాది, ప్రస్తుత ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఏడాదికి పది కోట్ల పైన అదనపు భారం పడింది.

విలువ ఆధారిత పన్ను కారణంగా గతంలో రూ.500 పన్ను చెల్లించిన వారు వారు నివాసం ఉండే ప్రాంతాన్ని బట్టి మార్కెట్ విలువ బట్టి రూ. 1500 నుంచి రూ.2వేలకు పెరిగింది. ఒక్క విజయనగరం నగర పాలక సంస్థలో రూ.10 కోట్లు అదనపు భారం పడగా, జిల్లాలోని బొబ్బిలి మున్సిపాలిటీ, రాజాం, చీపురుపల్లి, నగర పంచాయతీల్లోనూ ప్రజలపై భారాలు పడ్డాయి. విజయనగరంలో 69436 గృహాలు, 151 ప్రభుత్వ కార్యాలయాలు , 2723 ఖాళీ స్థలాలు నుంచి పన్ను వసూలు చేస్తున్నారు. విలువ ఆధారిత పన్ను ద్వారా గృహ వినియోగదారుల నుంచి రూ.26.24 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.190 లక్షలు, విఎల్ టి నుంచి రూ.3.80 కోట్లు వసూలు కానుంది.

ప్రతి ఏటా 15 శాతం పెరగనున్న ఆస్తి పన్ను

మరో వైపు విలువ ఆధారిత పన్ను విధింపు కారణంగా అధిక భారం పడిందని పట్టణ,నగర వాసులు బాధపడుతుంటే పుండు మీద కారం చల్లిన చందంగా ప్రతి ఏటా 15 శాతం పన్ను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంత వరకు పాలకవర్గం ప్రతి మూడేళ్లకు ఒక సారి నిర్ణయించి అక్కడి అవసరాలు, ప్రజలు ఆర్థిక స్థితిగతులు చూసి పన్నులు నిర్ణయించుకునే వారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థల హక్కును కాలరాసింది. స్థానిక సంస్థలకు సంబంధం లేకుండా ప్రతి ఏటా 15 శాతం పన్ను పెంపు అమలులోకి తెచ్చింది.

నిరంతర నిఘా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పాచిపెంట

సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టల వద్ద నిరంతర పటిష్ట నిఘా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని పద్మాపురం, పి.కోనవలస చెక్ పోస్ట్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. చెక్ పోస్టుల వద్ద కేసుల నమోదు, నగదు, వాహనాలు సీజ్ చేసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు తరలించకుండా 24గంటలు నిరంతర పటిష్ట నిఘాను పెట్టాలని సూచించారు. చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా చెక్ పోస్ట్ తనిఖీలను కంట్రోల్ రూమ్ నుంచి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. చెక్ పోస్టుల నుంచి సిసి కెమెరాల పని తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విధమైన ఉదాసీనతను ప్రదర్శించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమతో పాటు తీసుకువెళ్లే నగదు, బంగారం, ఆభరణాలు వంటి వాటికి విధిగా ఆధారాలు ఉండాలనిస్పష్టం చేశారు. మద్యం, మాదక ద్రవ్యాలు రవాణాపై గట్టి నిఘా ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపిడిఒ లక్ష్మీకాంత్



చెక్ పోస్టు వద్ద సిబ్బంది మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

వైసిపి విజయానికి మహిళల ర్యాలీ

జెండా ఊపి ప్రారంభించిన రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి



ర్యాలీని ప్రారంభిస్తున్న వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో నగరంలో శనివారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సిఎస్ జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీని వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ వై వి సుబ్బారెడ్డి, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జెండా ఊపి ప్రారంభించారు. కోట జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా నగరాభివృద్ధికి కషి చేసి, నగరాన్ని సుందరంగా తయారు చేసిన కోలగట్ల వీరభద్రస్వామిని ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపిగా గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని మరింత ప్రజలకు సేవ చేసేందుకు వైసిపిని గెలిపించాలని కోరారు. ర్యాలీలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటి మేయర్‌లు కోలగట్ల శ్రావణి, లయ యాదవ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కోలగట్ల సహకారంతోనే భూ ఆక్రమణలు : కాళ్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న అరాచకాలు, ఆక్రమణలను తాము రుజువు చేసేందుకు తాము సిద్ధమని, కోలగట్ల సిద్ధమేనా అని అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ కాళ్ల గౌరీశంకర్ సవాల్ చేశారు. శనివారం తన నివాసంలో మాజీ కౌన్సిలర్ గాడుఅప్పారావు, మరికొంతమంది అనుయాయులమతో కలసి మీడియాతో మాట్లాడారు. ఇటీవల జరిగిన వైసిపి సమావేశంలో ఆక్రమణలు రుజువు చేయాలని, చేస్తే నామినేషన్ వెయ్యబోనని చెప్పిన కోలగట్ల సవాల్‌ను స్వాగతిస్తున్నామని అన్నారు. నామినేషన్ వేసినా , వెయ్యకపోయినా ప్రజలు కోలగట్లకు ఎలా తీర్పు ఇవ్వాలో నిర్ణయించుకున్నారన్నారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నవారు, బిల్డర్లు ఆక్రమణలన్నీ కోలగట్ల నేతృత్వంలోనే చేశారని ఆరోపించారు. డబుల్ కాలనీ దగ్గర రాజమన్నార్ దేవాలయం భూమి పది ఎకరాలు అక్రమించరన్నారు. ఇది కోలగట్లకు తెలియదా అని ప్రశ్నించారు. దాసన్నపేట సర్వే నెంబర్ 815 లో ఎర్ర చెరువు ఏమైందని ప్రశ్నించారు. ఆక్రమించేసిన వారు ఎవరని ఎమ్మెల్యేని ప్రశ్నించారు. జమ్ములో ఉన్న భూమి కోర్టు స్టాట్సకోలో ఉంటే పట్టాలు ఇచ్చేసి అమ్మేస్తున్నారన్నారు. రోటరీ క్లబ్,ఛాంబర్ ఆఫ్ కామర్స్, మీడియా మధ్యవర్తిత్వం లో ఆక్రమించిన చెరువు, కబ్జా భూములు చూపిస్తానని, అందుకు మధ్యవర్తిత్వం వహించాలని రోటరీ క్లబ్ , ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు రాసిన లేఖ మీడియాకు చూపించారు.